క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: కుందన్‌బాగ్, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెథడిస్ట్ కాలనీ, రైల్వేట్రాక్, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్, రాక్ గార్డెన్ పార్కు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చీకోటి గార్డెన్, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజ్ మెయిన్‌రోడ్డు, అమృత విల్లా, విజువల్ సాఫ్ట్ బిల్డింగ్, కుందన్‌బాగ్ బస్తీ, ఉమానగర్ స్ట్రీట్ నంబర్–1 ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

పాటిగడ్డ, వసంతపురి సబ్‌స్టేషన్ల పరిధిలో..

పాటిగడ్డ, వసంతపురి సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కిమ్స్ మెయిన్‌రోడ్డు, ఇందిరానగర్, లాలాపేట్ కమాన్, గణేష్ టెంపుల్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ రోడ్డు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బుద్ధభవన్, శోభ కుమార అపార్ట్‌మెంట్ ఏరియా, ఆర్యాన్‌నగర్, శాంతినగర్ బస్టాప్ ఏరియా, వాటర్ ట్యాంక్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

పరామర్శ



సిరాజుద్దీన్‌ను పరామర్శిస్తున్న తలసాని

సనత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత సిరాజుద్దీన్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. సిరాజుద్దీన్ తనయుడు ఇర్ఫాన్ (34) సోమవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి మంగళవారం సనత్‌నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. మంత్రి వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

రైల్వే జీఎంకు శుభాకాంక్షలు



అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం రైల్వే జీఎం ఏకే. జైన్‌ను రైల్ నిలయంలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు మురళీకృష్ణ, డైరెక్టర్లు మల్లేష్, రాజారావు, సెక్రటరీ శ్రీనివాస సాయి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మంత్రి ఎర్రబెల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటేష్

లాలాపేట: బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓయూ విద్యార్థి నేత వేల్పుకొండ వెంకటేష్ మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును మంత్రుల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరంలో బీఆర్ఎస్ దేశ రాజకీయాల్లో బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

యువతి అదృశ్యం

కంటోన్మెంట్: డ్యూటీకి వెళ్లిన కూతురు తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. బోయిన్‌పల్లి పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. కంసారీ బజార్‌కు చెందిన బృందావతి, జగన్నాథ్ దాస్‌లకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరి చిన్న కుమార్తె శ్రావణి దాస్ (19) సికింద్రాబాద్‌లోని రమేశ్ వాచ్ దుకాణంలో పనిచేస్తుంది. ప్రతీరోజూ ఉదయం 10.30 గంటలకు డ్యూటీకి వెళ్లి రాత్రి 8.30 గంటలకు తిరిగి వచ్చేది. అయితే సోమవారం అర్ధరాత్రి అవుతున్నప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. షాపునకు ఫోన్ చేయగా శ్రావణి డ్యూటీకి రాలేదని తెలిసింది. దీంతో జగన్నాథ్ దాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేరు లేని బస్తీ.. సమస్యలతో కుస్తీ

- 486 నివాసాలకు ఆరు నల్లాలు, 10 టాయిలెట్‌లు
- అయినా ఓడీఎఫ్ అవార్డు ఇచ్చిన కేంద్రం!



మడ్‌ఫోర్ట్ బస్తీ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో చుట్టూ గేటెడ్ కాలనీల నడుమ ఓ బస్తీ ఉంది.. మూడున్నర దశాబ్దాల క్రితమే ఏర్పడిన ఈ బస్తీ నేటికీ కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు.. 486 గుడిసెలతో సుమారు రెండు వేల మంది నివసించే ఈ బస్తీకి నాలుగేళ్ల క్రితం వరకు విద్యుత్ సదుపాయం లేక అంధకారంలోనే మగ్గింది. బస్తీవాసులు సుదీర్ఘ పోరాటంతో ఎట్టకేలకు విద్యుత్ మీటర్లు వచ్చినా నల్లా కనెక్షన్‌లు, మరుగుదొడ్ల కోసం నేటికీ పోరాడుతూనే ఉన్నారు. పాలకులు ఎప్పటికప్పుడు హామీలు ఇవ్వడం మినహా ఎలాంటి పనులు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు తమ ప్రచార ఆర్భాటాలు, హంగామాకు ఈ బస్తీ వేదిక అవుతోందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కానీ ఏ ఒక్క స్వచ్ఛంద సంస్థ కూడా ఈ బస్తీలో శాశ్వత ప్రాతిపదికన సదుపాయాలు కల్పించిన దాఖలాల్లేవు. బోర్డు ఆధ్వర్యంలో కొంతకాలం బయోటాయిలెట్‌లు ఏర్పాటు చేసినా, నిర్వహణ లోపంతో కొన్ని రోజులకే వాటిని తొలగించారు. ఇదిలా ఉండగా కంటోన్మెంట్ ప్రాంతానికి ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (బహిరంగ మల, మూత్ర విసర్జన లేని) ప్రాంతంగా గుర్తిస్తూ కేంద్రం అవార్డు కూడా ఇవ్వడం గమనార్హం. కంటోన్మెంట్ బోర్డు వర్క్‌షాపునకు ఆనుకునే ఉన్న ఈ బస్తీలోనూ పూర్తిస్థాయిలో మరుగుదొడ్ల సదుపాయం ఉందని లెక్కలు ఏమార్చారో ఏమో!!

వలస కూలీలతో మొదలై..

- మడ్‌ఫోర్ట్ నుంచి డైమండ్ పాయింట్‌కు వెళ్లే మార్గంలో గన్‌రాక్ కాలనీకు ఎదురుగా ఉంటుందీ ఈ బస్తీ. సుమారు ఐదెకరాల రక్షణ శాఖ స్థలంలో దాదాపు 35 ఏళ్ల క్రితమే వలస కూలీలు ఇక్కడ గుడిసెలు ఏర్పాటు చేసుకోవడం ఆరంభమైంది. కాలక్రమేణా ఈ గుడిసెలు పెరుగుతూ ఓ బస్తీగా రూపాంతరం చెందింది. మూడు వేర్వేరుగా విభాగాలుగా ఏర్పడిన ఈ బస్తీలో వనపర్తి ప్రాంతానికి చెందిన 150కి పైగా గిరిజన కుటుంబాలు ఓ పక్కన, ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన భవన నిర్మాణ రంగంలో పనిచేసే మరో 120 కుటుంబాలు మరో పక్కన, ఇక మహబూబ్ నగర్, కర్నూలుతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన మరో 200 కుటుంబాలు మరో పక్కన ఉంటున్నాయి. వీరికి ఎలాంటి మౌలిక సదుపాయాల లేకపోవడంతో అంతా ఒక్కటై మరీ పోరాటం చేస్తున్నారు.

పేరు కూడా లేదు..

- 486 గుడిసెలతో కూడిన ఈ బస్తీకి ఇప్పటికీ పేరు కూడా లేకపోవడం గమనార్హం. స్థానిక నేత ఉత్తరయ్య ఈ బస్తీవాసులకు పట్టాల కోసం కొన్నేళ్లుగా పోరాటం చేస్తూ ఉండటంతో నేతలు అప్పట్లో ఈ ప్రాంతాన్ని ఉత్తరయ్య బస్తీగా పిలిచేవారు.
- మడ్‌ఫోర్ట్‌లో ఉంది కాబట్టి మడ్‌ఫోర్ట్ బస్తీ, మడ్‌ఫోర్ట్ గుడిసెలుగానూ వ్యవహరిస్తూ ఉంటారు.
- తాజాగా ఓ వర్గం ఈ బస్తీకి అంబేడ్కర్ హట్స్‌గా నామకరణం చేసి అదే పేరిట వ్యవహరించాలంటూ పేర్కొంటుంది. మొత్తానికి ఈ బస్తీకి ఇప్పటికీ అధికారిక నామం లేకపోవడం శోచనీయం.
- ఈ బస్తీలోని 486 గుడిసెలకు గానూ అధికారికంగా ఎలాంటి నల్లా కనెక్షన్‌లు లేవు. ఈ బస్తీ గుండా వెళ్లే పైప్‌లైను ద్వారా అనధికారికంగా 6 నల్లాలు ఏర్పాటు చేసుకున్నారు.
- టాయిలెట్ విషయానికి వస్తే ఆడవారికి ఐదు, మగవారికి 5 చొప్పున మొత్తం పది మాత్రమే ఉన్నాయి. గరిష్ఠంగా 30 గుడిసెవాసులు సొంతంగా టాయిలెట్ సదుపాయం ఏర్పాటు చేసుకున్నారు.
- నాలుగేళ్ల క్రితం వరకు విద్యుత్ సదుపాయం కూడా విద్యుత్‌చౌర్యానికి పాల్పడే వారు. ఎట్టకేలకు మీటర్లు రావడంతో కాస్త వెసులుబాటు కలిగింది.
- ప్రస్తుతానికి తాగునీరు, టాయిలెట్ సదుపాయం కల్పిస్తే అదే పదివేలు అని బస్తీవాసులు తలుస్తున్నారు.
- స్థానిక నేత శ్రీగణేశ్ సొంత నిధులతో టాయిలెట్‌లు నిర్మించేందుకు ముందుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- అయితే ఇటు కంటోన్మెంట్ బోర్డు కానీ, అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ చొరవ తీసుకుని పూర్తిస్థాయిలో టాయిలెట్‌లు, నల్లా నీటి కనెక్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

అన్ని ప్రాంతాలకు బస్సులను నడిపించాలి



సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: గతంలో మాదిరిగా సనత్‌నగర్ నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఆర్టీసీ అధికారులతో కలిసి సనత్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరంలోని వివిధ ప్రాంతాలకు సనత్‌నగర్ నుంచి నడిచే అనేక బస్సు సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే రద్దు చేసిన 158, 92, 9ఎం, 45, 83, 183, 283 బస్సు సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. అదేవిధంగా బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన వసతులు, సౌకర్యాలను కూడా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బస్టాండ్ పరిసరాలలో ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించి బస్సుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు చెక్..

సనత్‌నగర్ ప్రధాన రహదారిలోని జెక్‌కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సందర్శించి రోడ్డు విస్తరణ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉండి వాహనదారులు అనేక అవస్థలు పడేవారని సబ్‌స్టేషన్‌కు సంబంధించిన స్థలాన్ని రోడ్డు విస్తరణకు కేటాయించడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. మెయిన్‌రోడ్డులో ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి డివైడర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. మంత్రి వెంట ఆర్టీసీ ఆర్ఎం వెంకన్న, డీవీఎం ఏఆర్ఎస్ రెడ్డి, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జెక్‌కాలనీ అధ్యక్షుడు జి.సూర్యశంకర్‌రెడ్డి, డాక్టర్ వైవీ రాఘవయ్య, శ్రీహరి, ఎలక్ట్రికల్ ఎస్ఈ కామేష్, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనుల పరిశీలన



మడ్‌ఫోర్ట్ ఉత్తరయ్య గుడిసెవాసులతో సమస్యలపై మాట్లాడుతున్న శ్రీగణేష్

రసూల్‌పురా: 30 ఏళ్లుగా పది గజాల స్థలంలో గుడిసెలు వేసుకుని ఉంటున్న పేదలకు కనీస వసతులు కల్పించడంలో అన్ని పార్టీల నేతలు నిర్లక్ష్యం చేశారని శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీ గణేష్ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ ఉత్తరయ్య గుడిసెలు, అంబేడ్కర్ హట్స్‌లో శ్రీ గణేష్ పర్యటించి తన సొంత నిధులతో గుడిసెవాసులకు నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గుడిసెల్లో పర్యటించి స్థానికులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మరుగుదొడ్ల అవుట్‌లెట్ విషయమై డ్రైనేజీ పైప్‌లైను నిర్మించాలని, అదేవిధంగా నీటి సమస్య పరిష్కారానికి గుడిసెల మధ్య ఆరేడు ప్రాంతాల్లో ట్యాపింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సాయన్నతో సహా బీజేపీ సీపీఎం, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు, బోర్డు సభ్యులు గుడిసెవాసులకు హామీచ్చారే తప్పా ఒక్కరూ కూడా కనీస వసతులు కల్పించ లేదని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ.. తన ఒక్క అడుగుతోనే గుడిసెవాసులకు మరుగుదొడ్ల నిర్మాణం జరుగుతోందని ప్రతినాయకుడు దృష్టి సారిస్తే పేదల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఉత్తరయ్య, సోమ్లా, రంగన్న, భాస్కర్, సురేష్, నారాయణ స్వామి, శ్రీను, రామకృష్ణ వెంకటరాముడు, సునీత, పార్వతి, బుజ్జమ్మ రాజమ్మ పాల్గొన్నారు.

ముగిసిన వైకుంఠ ఏకాదశి వేడుకలు



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు

చిలకలగూడ: వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు లక్షలాది భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆకాంక్ష క్యాటరర్స్ అధినేత వేణుమాధవ్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు భక్తులకు ప్రసాదం, కేలండర్లు పంపిణీ చేశారు. సాయిబాబా సమేత బాలాంజనేయ ఆలయ ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సంగీత విభావరి కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. వైకుంఠ ఏకాదశి వేడుకలను విజయవంతం చేసిన భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తుల తోపాటు సహాయ సహకారాలు అందించిన పలు విభాగాల అధికారులకు ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఈఓ రాజేష్‌కుమార్ వేదస్వస్తి నిర్వహించిన రుత్వికులను ఘనంగా సన్మానించారు. చిలకలగూడ ఠాణా పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సీఐ నరేష్ తెలిపారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బాలాంజనేయ ఆలయ ట్రస్టీ సాయిబాబా

డిప్యూటీ మేయర్‌ను కలిసిన జీహెచ్ఎంసీ అధికారులు



డిప్యూటీ మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీలు

లాలాపేట: సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ దివాకర్ తదితరులు మంగళవారం డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డిని తార్నాకలోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం శోభన్‌రెడ్డి తదితరులున్నారు. హైదరాబాద్ మున్సిపల్ తెలంగాణ వర్కర్స్ యూనియన్ నాయకుల బృందం డిప్యూటీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల లోయర్ ట్యాంక్‌బండ్ టీబీటీ ప్రాంగణంలో సంభవించిన బాంబు పేలుడు ఘటనలో గాయపడ్డ వారిని ఆదుకోవాలని ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, నర్సింగరావు, రాజ్‌కుమార్, మల్లేష్ తదితరులున్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్



అడ్డగుట్టలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న మహిళలు

అడ్డగుట్ట: సమాజంలో ఉన్న రుగ్మతులను రూపుమాపడానికి కృషి చేసిన సామాజిక సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని పలువురు మహిళలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతిని అడ్డగుట్టలో స్థానిక మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భాగ్య, సంధ్య, కనకమ్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం మహిళలంతా సంఘటితం కావాలి..

లాలాపేట: 21వ శతాబ్దం మహిళా శతాబ్దంగా సావిత్రీ బాయి పూలే స్ఫూర్తితో పెండింగ్‌లో ఉన్న 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం మహిళలంతా సంఘటితం కావాలని దక్షిణ భారత సమితి(డీబీఎస్) కన్వీనర్, ఓయూ లా కళాశాల డీన్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం డీబీఎస్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రాజకీయ రంగంలో కేవలం 20 శాతం మహిళా ప్రాతినిధ్యం లేని కారణంగా 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు 35 ఏళ్లుగా పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది చంద్రకళ, నిర్మల పరపతి సంఘం అధ్యక్షురాలు నిర్మల, చరణ్ తదితరులున్నారు.

సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకోవాలి



శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మేయర్

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అంజనీకుమార్‌ను మంగళవారం మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీకరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి తదితరులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మాజీ మేయర్ డీజీపీని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: సెల్‌ఫోన్ మాట్లాడుతూ పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని ఎండ్రియల్ గ్రామానికి చెందిన బాణాల నర్సింహారెడ్డి(19). మేడ్చల్‌లోని సీఎంఆర్ కాలేజీలో చదువుతున్నాడు. ఈనెల 2న రాత్రి 9 గంటల సమయంలో భోజనం చేసి ఈసీ క్యాంపస్ నుంచి ఫోన్ మాట్లాడుతూ.. బయటకు వచ్చాడు. అలాగే ఫోన్ మాట్లాడుతూ మేడ్చల్ నుంచి గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రైలు ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరుసటి రోజు ఉదయం సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి నరసింహారెడ్డి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న కళా సిల్క్ వస్త్ర ప్రదర్శన

లాలాపేట: తార్నాకలోని ఐఐసిటి స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్, సేల్స్ ప్రదర్శన ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు వికాస్ జైన్ పేర్కొన్నారు. గత కొన్ని రోజుల నుంచి కొనసాగుతున్న ఈ ప్రదర్శనకు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. అన్ని రకాల ఫ్యాషన్ వస్త్రాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కళా సిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు.



మురికివాడల ప్రజలకు సేవలందించేందుకే సాహితి ఫౌండేషన్



సమావేశంలో పాల్గొన్న సాహితి ఫౌండేషన్ సభ్యులు

అడ్డగుట్ట: నగరంలోని మురికివాడల్లో పర్యటించి విద్యా, వైద్యం సత్వర న్యాయం కోసం పనిచేసేందుకు సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆ ఫౌండేషన్ చైర్మన్ రాముల కొమురయ్య తెలిపారు. మంగళవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా పలువురికి సహాయం చేసేందుకు మురికివాడల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఫౌండేషన్ ప్రతినిధులు పని చేస్తారన్నారు. అడ్డగుట్ట డివిజన్ నుంచే తమ సేవలను ప్రారంభిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. సమావేశంలో సంస్థ చీఫ్ కో ఆర్డినేటర్ రామని వెంకటేష్, ఎడ్ల శ్రీనివాస్‌రావు, నిత్యానంద్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహం.. వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

అమీర్‌పేట: అమీర్‌పేట దరంకరం రోడ్డులోని ఎస్ఆర్‌నగర్ రవీంద్రభారతి స్కూలు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఉదయం నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి హాజరయ్యారు. జంక్ ఫుడ్‌తో కలిగే నష్టాలు, పాత సినీనటులను నృత్యాలు, రైతుల కష్టాలు, సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలను చిన్నారులు నాటకం, ప్రదర్శనల ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి బాబురావు, అసిస్టెంట్ జోనల్ ఇన్‌చార్జి కిషోర్, అకాడమిక్ డైరెక్టర్ నిర్మలవాణి, డీన్ శ్రీలత, డీఐ మధు పాల్గొన్నారు.



శాట్స్ చైర్మన్‌గా ఆంజనేయగౌడ్ నియామకం పట్ల హర్షం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ) శాట్స్ చైర్మన్‌గా ఓయూ విద్యార్థి నేత ఈడగ ఆంజనేయగౌడ్‌ను నియామకం పట్ల బీఆర్ఎస్వీ, ఓయూ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచుకొని అభినందనలు తెలిపారు. విద్యార్థి నేతలు గొనింటి వినోద్‌కుమార్, కరుణాకర్, చక్రవర్తి నాగరాజు, రాఘవేంద్ర, అనిల్, ధనుంజయ్, అభిరామ్, వివేక్, విక్రమ్, శివ, పురుషోత్తం పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



టీచర్స్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్, జలమండలి అధికారులు

కంటోన్మెంట్: మోండా డివిజన్ టీచర్స్ కాలనీలోని మురుగు నీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుందని కార్పొరేటర్ కొంతం దీపిక అన్నారు. జలమండలి డీజీఎం కృష్ణ, మేనేజర్ శ్రవంతితో కలిసి మంగళవారం టీచర్స్ కాలనీలో ఆమె పర్యటించారు. అధికారులతో కలిసి అన్ని వీధులు కలియ తిరిగి సమస్యను గుర్తించారు. తరచూ మరమ్మతులు చేపడుతున్నా మళ్లీ మళ్లీ మురుగునీరు రోడ్లపైకి వస్తూ ఉండటంతో, ఈ దఫా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో కాలనీవాసులు సైతం పాల్గొని తగిన సూచనలు చేశారు.